క్లుప్తంగా

మార్కెట్ యార్డు పరిశీలన



నిమ్మకాయల నాణ్యత పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పెదవేగి: రైతులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. శనివారం ఆమె దెందులూరు నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గంలో సమస్యలు, అభివృద్ధి పనుల ప్రతిపాదనలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆమెకు వివరించారు. కలెక్టర్ ముందుగా మండలంలోని లక్ష్మీపురంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పర్యటించి నిరుపయోగంగా ఉన్న షెడ్లను పరిశీలించారు. మార్కెట్ యార్డు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను ఎమ్మెల్యే చింతమనేని వివరించగా, దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులోని నిమ్మకాయల నిల్వలను, మార్కెటింగ్ సేవలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మరియ మాత పండుగ



ఫాదర్ రాజును సత్కరిస్తున్న ఉపదేశీయులు

దెందులూరు: నాగులదేవునిపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఇంటి జేవియర్ ఆధ్వర్యంలో మరియమాత పండుగను ఘనంగా శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏలూరు పీఠం ప్రొక్యురేటర్ ఫాదర్ రాజు హాజరయ్యారు. ఫాదర్ జేవియర్, ఫాదర్ రాజు ప్రత్యేక దివ్య పూజాబలి అర్పించారు. అనంతరం ఫాదర్ రాజును నాగులదేవునిపాడు ఉపదేశీయులు, సంఘ పెద్దలు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

యువతకు నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో జీఆర్ మనోజ్

ఉంగుటూరు: మండలం పరిధిలో నైపుణ్య గణన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీఆర్ మనోజ్ తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లకు నైపుణ్య గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతను గుర్తించి, వారికి ఉన్న నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామన్నారు. యువతకు ఆసక్తి ఉన్న అంశాల్లో శిక్షణనిస్తామని తెలిపారు. నైపుణ్య గణనను సచివాలయ సిబ్బంది నిర్వహిస్తారన్నారు.

రైతులకు నష్ట పరిహారం జమ

ఏలూరు రూరల్: ఇటీవల వచ్చిన వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించిందని మండల వ్యవసాయ అధికారిణి జీవన సంధ్య చెప్పారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏలూరు రూరల్ మండలంలో జాలిపూడి పరిసర గ్రామాల్లో 70 ఎకరాలు ముంపుబారిన పడ్డాయన్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందించామని గుర్తు చేసారు. ఎకరానికి రూ 10 వేలు చొప్పున మొత్తంగా 7 లక్షల రూపాయలు ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమ చేసిందన్నారు.

మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): దీపావళి పండుగ సందర్భంగా ఏలూరు పట్టణంలో ప్రమాదంలో చనిపోయిన మృతుడు దుర్గేసి సుధాకర్ కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఇంకా ప్రమాదానికి గురైన క్షతగాత్రులకు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం ఏలూరు నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు పట్టణంలో దీపావళి పండుగ సందర్భంగా ఎన్నడూ లేని విధంగా బాణసంచా పేలుడు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందటం చాలా బాధాకరమన్నారు. మృతుడు తూర్పు వీధి మారుతి నగర్‌లో పేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని అన్నారు. కాబట్టి ఆ కుటుంబానికి మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించిన పరిహారం ఏమాత్రం సరిపోదని తెలిపారు. మృతుడు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకొని రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు వీవీఎస్ ప్రసాద్, బి.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వేలపై ప్రయాణం.. వర్షం కురిస్తే ఆటంకం

- పెదపాడు– వట్లూరు రహదారిపై వంతెన నిర్మించాలని రైతుల డిమాండ్
- వర్షాకాలం స్కూళ్లు, కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థుల అవస్థ



పెదపాడు వట్లూరు రహదారిపై నిలిచిన రాకపోకలు (ఫైల్)

పెదపాడు: పెదపాడు– వట్లూరు రహదారిపై ఉన్న కాజ్‌వే స్థానంలో వంతెనల నిర్మాణం చేపట్టాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు. పెదపాడు మండలంలోని వట్లూరు పెదపాడు రహదారిపై కాలువలపై కాజ్‌వేలు నిర్మించారు. ఈ కాజ్‌వేల వద్ద వర్షాకాలంలో సరుకు, ధాన్యం రవాణాకు, ప్రయాణాలకు అంతరాయం ఏర్పడుతోంది. రైతులు, వాహనదారులు విద్యార్థులు ఏటా ప్రయాణానికి ఎంతో ఇబ్బంది పడుతున్నారు. దీని వల్ల పనులకు, పాఠశాలలకు వెళ్లేందుకు అంతరాయం కలుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. రోజూ విద్యార్థులు ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్, సీఆర్‌ఆర్ మహిళా కళాశాల, ఐటీఐ కళాశాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలలకు, రైతులు నిత్యం పంట పొలాల్లో వివిధ పనులకు ఈ రహదారినే వినియోగిస్తుంటారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా కాజ్‌వేలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో విద్యార్థులకు కళాశాలలకు వెళ్లేందుకు ఆటంకం కలుగుతోంది. దీంతోపాటు పెదపాడు మండలంలోని కొక్కిరపాడు, కలపర్రు వట్లూరు గ్రామాల ప్రజలు పెదపాడు మండల కేంద్రానికి వెళ్లేందుకు ఈ రహదారిపైనే ఆధారపడుతుంటారు. నిత్యం వందలాది మంది ఈ రహదారి మీదుగానే తమ రవాణా కార్యకలాపాలు కొనసాగిస్తుంటారు.

దగ్గరి దారి కావడంతోనే..

పెదపాడు నుంచి వట్లూరు వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో ఎక్కువమంది ఈ రహ దారినే ఆశ్రయిస్తుంటారు. వట్లూరుకు పెదపాడు బళ్ల రేవు తూము సెంటర్ నుంచి 6.5 కిలోమీటర్ల దూరం మాత్రమే కావడంతో ఈ రహదారిపై ఆధారపడుతుంటారు. దీంతో సుమారు 10 కిలోమీటర్లు మేర ప్రయాణం తగ్గడంతోపాటు సమయం ఆదాఅవుతోంది.

కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలి



వర్షాలు కురిసే సమయంలో కాజ్‌వేలు మీదుగా నీరు ప్రవహించడంవల్ల రోజుల తర బడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజల పనులకు అంతరాయం ఏర్పడుతోంది. కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణం చేపడితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– కె.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

శిథిలావస్థలో కాజ్‌వే

పెదపాడు నుంచి వట్లూరు వెళ్లే ఈ రహదారిపై రెండు కాజ్‌వేలు ఉన్నాయి. వాటిలో ఒకటి రహదారి మధ్యలో కుంగిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తంచేశారు. రెండు కాజ్‌వేల వద్ద ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా వంతెన నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీంతో ప్రయాణానికి ఎలాంటి ఆటంకం ఏర్పడదు.

రోడ్డు అభివృద్ధి పనుల ప్రారంభం

భీమడోలు: రహదారులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు జంక్షన్‌లో శనివారం రహదారుల అభివృద్ధి పనులను ఆయన మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఏఈ జే.భాస్కరరావు, ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతు పనులకు శంకుస్థాపన

దెందులూరు: రహదారుల నిర్మాణానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం దెందులూరు మండలం సోమవరప్పాడులోని జాతీయ రహదారి నుంచి గోపన్నపాలెం వరకు రూ.13 లక్షలతో రోడ్డుపై గుంతలను పూడ్చే పనులను మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే చింతమనేని శనివారం ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) అధ్యక్షతన సభ నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, తహసీల్దార్ బి. సుమతి, ఎంపీడీవో శ్రీదేవి తదితరులు ఉన్నారు.

విద్యార్థుల అభ్యసన పురోభివృద్ధికి 'అపార్'

- విద్యాసంబంధిత గుర్తింపు కార్డుగా ఉపయోగకరం
- ధ్రువపత్రాల డిజిటలైజేషన్‌కు దోహదం



దెందులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

దెందులూరు: ప్రజలకు ఆధార్‌కార్డు ఎలా గుర్తింపుగా ఉపయోగపడుతుందో అదే విధంగా విద్యార్థులందరికీ విద్యాసంబంధిత గుర్తింపుకార్డుగా ×అపార్‌₹ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్టరీ) ఏర్పాటు చేశారు. ఈ అపార్‌లో 12 అంకెల విశిష్ట సంఖ్య. విద్యార్థులందరీ అభ్యాసన పురోభివృద్ధిని తెలుసుకునేందుకు, వారి ధ్రువపత్రాలను డిజిటల్ విధానంలో భద్రపరచడానికి అపార్ కార్డు ఉపయోగపడుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరికీ అపార్ కేటాయిస్తారు. ప్రస్తుతం 9, 10 తరగతి విద్యార్థుల అపార్ ఐడీలు ఇవ్వడానికి చర్యలు ప్రారంభించారు. అపార్ ఐడీలు కేటాయింపులో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థి ఆధార్‌కార్డులో పుట్టిన తేదీ, పాఠశాల రికార్డుల్లో పుట్టిన తేదీ కొందరికి ఒకే విధంగా ఉండకపోవడం, పేరు తేడాగా ఉండటం, యూడీఐఎస్‌ఈఐ ఆధారాలతో సరిపోకపోవడం వంటి సమస్యలను అధిగమించడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కృషి చేస్తున్నారు.

మండలం	విద్యార్థులు
దెందులూరు	1,409
పెదవేగి	1,000
పెదపాడు	2,168
ఏలూరు రూరల్	10,000

విద్యార్థులకు వరం



అపార్ ఐడీ పాఠశాల విద్యార్థులందరికీ వరం. ఈ నూతన విధానం భవిష్యత్తులో విద్యార్థికి సంబంధించిన పూర్తి సమాచారం పొందుపరిచి ఉండటంతో తెలుసుకోవడానికి, సమస్యలను పరిష్కరించడం వేగవంతమవుతుంది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రయోజనాకారిగా ఉపయోగపడుతుంది.

– ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ, హెచ్ఎం, కొవ్వలి

ఐడీల నమోదుకు సమష్టి ప్రణాళిక



అన్ని ఉన్నత పాఠశాలల్లో అపార్ ఐడీ కార్డులు మంజూరుకు ప్రణాళిక సిద్ధమైంది. విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. ధ్రువపత్రాలు, విద్యాప్రగతి, జవాబుదారీతనం ఆలస్యం లేని సమాచార సేకరణ అపార్ సొంతమవుతుంది.

– ఏవీఎస్‌వీ ప్రసాద్, ఎంఈఓ–1, దెందులూరు

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవం



గుండుగొలనులో అమ్మవారి ఆలయానికి నీళ్ల బిందెలతో వస్తున్న మహిళలు, పూజారులు

భీమడోలు: గుండుగొలనులోని బీసీ కాలనీలో వేంచేసియున్న కనకదుర్గ, గణపతి స్వామి వార్ల ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం ఆలయంలో పండితులు శ్రీలంక శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శిష్య బృందం ఎస్.సుధీరాచార్యులు, వి.సాగర్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పంచామృత, ఫలరస, సహిత అష్టత్తర శత కలశాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ నీటితో నిండిన బిందెలను నెత్తిన పెట్టుకుని మహిళలు, చిన్నారులు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహానికి జలాభిషేకం చేశారు. ఈ నెల 3వ తేదీ ఆదివారం ఆలయంలోని పాత విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవినీతిరహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అవినీతి దేశ అభివృద్ధికి ఆటంకమని, అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని ఏలూరు ఏసీబీ డీఎస్పీ వి.సుబ్బరాజు పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాలులో అవినీతి రహిత సమాజ నిర్మాణంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేపీఎస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ అవినీతిలేని సమాజాన్ని నిర్మించాలంటే మనలో ప్రతి ఒక్కరూ అవినీతికి పాల్పడకుండా ఉండాలన్నారు. ఈ అవగాహన సదస్సుకు కళాశాల ప్రిన్స్‌పాల్ కేపీ రామరాజు అధ్యక్షత వహించగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎండీ మహబూబ్ భాషా, బి. శంకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ. ధర్మేంద్ర పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో అవినీతి నిర్మూలన

ఏలూరు రూరల్ : అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్‌వైకే అధికారి దూలం కిషోర్ అన్నారు. నిఘా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

డిగ్రీ, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి

దెందులూరు: విద్యా సంవత్సరం చివరి దశకి వస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టభద్రులకు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు నేటికీ ఇవ్వకపోవడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ ఎం సూర్యనారాయణ అన్నారు. శనివారం కొవ్వలిలో అయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది పట్టభద్రులకు స్కాలర్‌షిప్‌లు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలో స్కాలర్‌షిప్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఈ నెల 6వ తేదీతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు పొందేందుకు ఆఖరి గడువు ముగుస్తుందని గుర్తు చేశారు. పట్టభద్రులు పోస్ట్ గ్రాడ్యుయేట్లు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని సూర్యనారాయణ కోరారు.

భక్తి శ్రద్ధలతో సమాధుల పండుగ



కవ్వగుంటలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పెదలింగంపాడులో సమాధుల వద్ద ప్రార్థన చేస్తున్న దృశ్యం

పెదవేగి : మరణించిన తమ కుటుంబ సభ్యులు పరలోకంలో సంతోషంగా ఉండాలని కోరుకుంటూ క్రైస్తవ భక్తులు సమాధుల తోటలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధుల పండగను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లోని కథోలిక (రోమన్ కేథలిక్ మినిస్ట్రీస్) సంఘస్తుల కుటుంబాల్లో మరణించిన వారి సమాధుల వద్దకు వెళ్లి కొద్ది రోజులుగా చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, రంగులతో అలంకరించి శనివారం ప్రత్యేకంగా పూలతో అలంకరించి, విచారణ గురువుల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనల్లో దూరప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమాధుల తోటలో ప్రార్థనలు

భీమడోలు: చనిపోయిన తమ కుటుంబీకుల ఆత్మలకు శాంతి చేకూరగాలని కోరుతూ సమస్త పరిశుద్ధ ఆత్మల పండుగ (సమాధుల తోట) దినోత్సవాన్ని శనివారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, భోగాపురం, కొల్లేరు గ్రామాల్లోని క్రైస్తవులు ఈ పండుగను జరుపుకున్నారు. సమాధులను సుందరంగా అలంకరించి సాయంత్రం కొవ్వొత్తులను వెలిగించి ప్రార్థనలు చేశారు. భీమడోలు పంచాతీయతీ శివారు పెదలింగంపాడులోని ఆర్‌సీఎం విచారణ గురువులు షింటో, జార్జి, మెల్సన్ దివ్యపూజ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, సంఘం పెద్దలు ఓగిరాల సురేష్, కురమా విజయరాజు, జంగం తంబి, కొండ సుబ్బారావు, గోరింకల సంజీవరావు, పులిపాటి తంబి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దెందులూరు మండలంలో..

దెందులూరు: గ్రామాల్లో శనివారం సమాధుల పండుగ నిర్వహించారు. దెందులూరు, నాగులదేవునిపాడులో ఆర్‌సీఎం చర్చి ఫాదర్లు జి. అమ్మన్‌రాజా, ఇంటి గ్జేవియర్ ఆధ్వర్యంలో దెందులూరు ఆర్‌సీఎం సమాధుల తోట, నాగులదేవునిపాడులో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సంఘ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపదేశీయులు మల్లిక్, విక్టర్ బాబు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం పరిశీలన



బాలుర వసతి గృహంలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్) : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ ఏలూరు శనివారపుపేటలోని బాలుర వసతి గృహాన్ని శనివారం సందర్శించి, వసతి గృహాల పరిశుభ్రత, నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవిద్యార్థులకు అందించే ఆహార నాణ్యతలో రాజీ పడవద్దని, బాల్యంలో మంచి పోషక ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత వ్యవస్థలపై ఉందని సూచించారు. అలాగే విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించి వారి మానసిక ఆరోగ్య పరిరక్షణకు మానసిక వికాసాన్ని పెంపొందించేలాగా చూడాలని ఆదేశించారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

డిసెంబర్ 14వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

రూ.25 లక్షలతో రోడ్ల మరమ్మతులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని రోడ్ల మరమ్మతులకు రూ.25లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) తెలిపారు. స్థానిక 7వ డివిజన్‌లోని సత్యనారాయణ థియేటర్,విజయలక్ష్మి థియేటర్ మధ్య రోడ్డులో మరమ్మతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నగరంలోని 50 డివిజన్ల పరిధిలో సుమారు 600కు పైగా గుంతల రోడ్లు ఉన్నట్లు గుర్తించి వాటి మరమ్మతులకు రూ.25 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలను గురించి రోడ్డు యాక్సిడెంట్లు నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ట్రాఫిక్ పోలీసులు శనివారం అవగాహన కల్పించారు. ఏలూరు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో వీడియో రూపంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రహదారిపై నడిచే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే ఎటువంటి ప్రమాదాలకు గురి కాకుండా గమ్యస్థానాలకు చేరుకుంటారన్నారు. హెల్మెట్ ఉపయోగం గురించి మీ కుటుంబ సభ్యులకు చిన్నపిల్లలు అయినా మీరే జాగ్రత్తలు తెలియజేస్తే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తికి రిమాండ్

నిడమర్రు: చానమిల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామకృష్ణను అరెస్టు చేసి శనివారం తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి చానమిల్లిలో బెల్ట్ దుకాణం ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం విక్రయిన్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి 25 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని రామకృష్ణను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

మల్లవరం గ్రామాభివృద్ధికి కృషి



మల్లవరంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, పక్కనే ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు: కొల్లేరు పరిధిలోని మల్లవరంలో రూ.30లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, రాష్ట్ర పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. చెట్టున్నపాడు పంచాయతీ శివారు మల్లవరంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు బోయిన చిన సత్యనారాయణ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తాను రూ.10 లక్షల నిధులు కేటాయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, మాజీ రాజ్యసభ ఎంపీ బీదమస్తానరావు, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రొంగడి కృష్ణ యాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.